
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి ములుగు

శనివారం 20 ఏప్రిల్ 2024





సీఎం ప్రసంగ సమయంలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు



మహబూబాబాద్ జనజాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన జనం

మానుకోట 'జన జాతర'లో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే

- దశాబ్దం పాటు దగా చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి
- ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీలను అడ్డుకున్న బీజేపీ
- కమ్యూనిస్టులతో రేపో, మాపో 'కూటమి' చర్చలు పూర్తి
- మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోటగానే ఉంటుందని, ఈ ప్రాంతానికి దశాబ్దకాలం పాటు అన్యాయం చేసిన ద్రోహులు బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ... గతంలో పార్లమెంట్‌లో తెలంగాణ వద్దన్న మోదీ.. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి అడ్డుకుంటున్నారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఓట్లు ఏం మొఖం పెట్టుకుని అడుగుతున్నారని, ఆయనకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. ఇక ఇండియా కూటమితో కలిసి రావడానికి కమ్యూనిస్టులు, తెలంగాణ జనసమితి, ప్రజాసంఘాలతో చర్చించే బాధ్యతను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అప్పగించామని, రేపో, ఎల్లుండో ఆ చర్చలు పూర్తవుతాయన్నారు. తద్వారా కలిసొచ్చే ప్రజాస్వామ్య శక్తులతో ఇండియా కూటమి గెలుపు ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధానిగా ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. తెలంగాణలో సర్పంచ్‌ల స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల వరకు పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా... మహబూబాబాద్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. అలాంటి అభివృద్ధి చేయని బీఆర్‌ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి కొట్టారని గుర్తు చేశారు. తిరిగి లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.



సీఎంకు నాగలి, భద్రాద్రి సీతారామచంద్రస్వామి జ్ఞాపికలను బహూకరిస్తున్న నాయకులు

బీజేపీ, బీఆర్‌ఎస్ తోడుదొంగలు..

ఢిల్లీలో మోదీ... తెలంగాణలో ఫాంహౌజ్ కేడీ ఇద్దరు తోడు దొంగలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే రాష్ట్రంలో ఐదు సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు, 370 ఆర్టికల్, తదితర అమలుకు మోదీకి అండగా నిలబడి గెలిపించాయన్నారు. ఆ కవిత ఐనా.. ఈ కవిత ఐనా ఒక్కటేనంటూ కల్వకుంట్ల కవితను, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవితను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన ఆయన బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్‌కు

మిగతా 7వ పేజీలో..

శ్రేణుల్లో జోష్

- మానుకోటలో ముఖ్యమంత్రి తొలిసభ సక్సెస్
- మండుటెండలో వచ్చి.. గంటన్నర వేచి ఉన్న సీఎం
- వేడిమిలోనూ 23 నిమిషాలు ప్రసంగం
- జనం చప్పట్లు, కేరింతలతో మార్మోగిన ప్రాంగణం

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'జనజాతర సభ' సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రేవంత్‌రెడ్డి తొలిసారి మహబూబాబాద్ పట్టణంలో జరిగిన సభకు హాజరవడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి ఉత్తేజపూరిత ప్రసంగం హస్తం పార్టీ నేతల్లో జోష్ నింపింది. స్వరాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో అత్యధిక స్థానాల్లో ఎంపీలను గెలుచుకునేలా ప్రణాళికలు రచిస్తూ.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడుసభలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్న కాంగ్రెస్.. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత అటు మహబూబ్‌నగర్‌లో రోడ్‌షో చేపట్టగా, మొదటగా మహబూబాబాద్‌లో తొలి జనజాతర సభను నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో సభ విజయవంతాన్ని ప్రతిష్టాత్మకంగా

మిగతా 7వ పేజీలో..



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 19 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో, ఎంపీవోలతో సమావేశం నిర్వహించి తాగునీటి సమస్య నివారణ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ రాబోయే 2 నెలలు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేసే క్రమంలో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు, లీకేజీలు తలెత్తితే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమస్యలపై వాకబు చేస్తూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులకు హరితహారంలో నాటిన మొక్కలు, గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను జాప్యం చేయకుండా పాఠశాలల పునఃప్రారంభం వరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 271 పాఠశాలల్లో పనులు చేయాల్సి ఉండగా 209 పాఠశాలలకు పరిపాలన అనుమతులు ఇచ్చామని, మిగిలిన 62 పాఠశాలల ప్రతిపాదనలను శనివారం వరకు అందజేయాలని డీఈవోలను కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనుల్లో ప్రతి విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసి ఉండాలన్నారు. పనుల్లో జాప్యం జరిగినా, నాణ్యత లోపించినా సంబంధిత ఎంపీడీవోలకు మెమోలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

రివార్డు అందజేసిన ఎస్పీ శబరీశ్



లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 19: మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు దళసభ్యులు శుక్రవారం ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. వాజేడు మండలం ప్రగళ్లపల్లికి చెందిన పుల్లూరు నాగరాజు అలియాస్ జగత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన నుప భీమా అలియాస్ సంజు, ముచకి దుల్లో అలియాస్ సోనీ జనజీవన స్రవంతిలో కలిశారు. వారికి ఎస్పీ శబరీశ్ రివార్డు మొత్తాన్ని అందజేశారు. కాలంచెల్లిన సిద్ధాంతాలతో అడవుల్లో ఉంటూ పోరాటం చేయడాన్ని మానుకుని కుటుంబసభ్యులతో అమూల్యమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ మావోయిస్టులకు సూచించారు. ప్రభుత్వం పునరావాసం కల్పించి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 39 బెటాలియన్ కమాండెంట్ రాజేష్‌తివారి, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు ఇంకిపాయే.. చేపలు చనిపాయే..

చింతకాని గూడెపు చెరువులో భారీ సంఖ్యలో మృత్యువాత

లబోదిబోమంటున్న పెంపకందారులు



చనిపోయి చెరువు ఒడ్డున తేలిన చేపలు

కాటారం, ఏప్రిల్ 19 : రోళ్ల పగిలేలా మండుతున్న ఎండలతో జలవనరులు అంతరించిపోయి చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఉపాధితో పాటు ఆదాయం కలిగిస్తాయని పెంచిన వేలాది జలపుష్పాలు కళ్ల ముందే చనిపోతుంటే పెంపకందారులు లబోదిబోమంటున్నారు. మండలంలోని చింతకాని గ్రామపంచాయతీ పరిధిలోని గూడెపు చెరువులో నీరు ఇంకిపోయి సుమారు ఆరేడు క్వింటాళ్ల మేర చేపలు చనిపోయాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' చెరువును సందర్శించడంతో కొద్దిపాటి నీళ్లే ఉండగా వేలాది పెద్ద, చిన్న చేపలు చనిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. జిల్లాలోని రేగొండ మండలానికి చెందిన రవి అనే ముదిరాజ్ మరికొంత మందితో కలిసి చెరువును లీజుకు తీసుకుని లక్షలాది రూపాయల విలువైన చేప పిల్లలను వదిలాడు. చెరువంతా ఎండిపోయి కొద్ది పాటి నీళ్లే ఉండగా చేపలకు ఆక్సిజన్ అందకపోవడంతో చనిపోయాయి. మరికొన్ని చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. మండుతున్న ఎండలకు తోడు రైతులు వరి పొలాలకు రాత్రి, పగలు మోటార్లతో నీటిని తోడేస్తుండటంతో చెరువులో నీరు పూర్తిగా ఇంకిపోయి క్వింటాళ్ల కొద్దీ చేపలు చనిపోయాయని రవితో పాటు పలువురు పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేశారు. లీజు కోసం కట్టిన డబ్బులతో పాటు చేప పిల్లల పెంపకం కోసం లక్షలాది రూపాయలు వెచ్చించగా చేపలు పట్టి విక్రయించే సమయంలో క్వింటాళ్ల కొద్దీ చనిపోవడంతో సుమారు రూ.3.5 లక్షల మేర ఆర్థికంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. తూముకు నీళ్లందక పోవడంతో పలువురు రైతులు చెరువులోనే మోటార్లు పెట్టి పొలాలకు పెట్టుకుంటున్నారని, రెండు మూడు రోజులు ఆగితే చేపలు పట్టుకుంటామని వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. కాగా, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సరైన వర్షాలు కురియక ఇబ్బందిగా మారిందని పెంపకందారులు కన్నీరుమున్నీరయ్యారు.

కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్

జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు



ములుగు, ఏప్రిల్ 19: ములుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. శుక్రవారం అత్యధికంగా మంగపేట మండలం మల్లూరులో 44.6 డిగ్రీలు, అత్యల్పంగా వెంకటాపూర్(రామప్ప) మండలం వెల్తుర్లపల్లిలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తాడ్వాయి మండలం మేడారంలో 44, వెంకటాపురం(నూగూరు)లో 43.3, ములుగు మండలం కాసిందేవిపేటలో 43.1, వాజేడు మండలం ధర్మవరంలో 43.1, కన్నాయిగూడెంలో 43.1, ఏటూరునాగారంలో 43, గోవిందరావుపేటలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కొడుకా.. నిన్ను ఒక్కసారి చూడాలి..

రాష్ట్ర కమిటీ సభ్యుడు దామోదర్ తల్లి బతుకమ్మ

వృద్ధాప్యంలో చేయూతను అందించిన పోలీసులు



బతుకమ్మ బాగోగులు తెలుసుకుంటున్న సీఐ శంకర్

మేడారం, ఏప్రిల్ 19 : 'కొడుకా.. నిన్ను ఒక్కసారి చూడాలి.. నేను కన్నుమూసేలోగా ఇంటికి రా బిడ్డా.. అని ఆ తల్లి కన్నీరు మున్నీరైంది. అసలే చేతనైతలేదు.. మాకు కడుపుకోత మిగల్చకు.. ఈ తల్లి గోడు విని లొంగిపో బిడ్డా అని ఆవేదన వ్యక్తం చేసిన తీరు అందరినీ కలిచివేసింది. ఈ సంఘటన తాడ్వాయి మండలం కాల్వపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. కన్న కొడుకును ఒక్కసారైనా చూడాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తల్లి బడే బతుకమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. కాల్వపల్లిలోని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ

మిగతా 8వ పేజీలో...

కన్నీరు పెట్టిన చల్లగరిగె

- ముగిసిన మావోయిస్టు దంపతుల అంత్యక్రియలు
- ప్రజా సంఘాల నాయకుల నివాళులు



చల్లగరిగెలో సుధాకర్, సుమన దంపతుల అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్థులు, బంధువులు, ప్రజా సంఘాల నేతలు

చిట్యాల, ఏప్రిల్ 19: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్, బస్తర్ ప్రాంతంలో ఈనెల 16న పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం డేడ్రాకు చెందిన దాసరివాడ సుమన అలియాస్ రజిత దంపతులు మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామమైన చల్లగరిగెలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల అశ్రునయనాల మధ్య వారి అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. 24ఏళ్ల క్రితం వెళ్లి అజ్ఞాతంలో ఉండగానే వివాహం చేసుకుని విగతజీవులుగా ఇంటికి రావడంతో తట్టుకోలేకపోయిన కుటుంబసభ్యులు, చల్లగరిగె గ్రామస్థులు కన్నీరు పెట్టుకున్నారు. సుధాకర్, రజిత మృతదేహాలకు గ్రామస్థులతో పాటు పలు పార్టీల ప్రజాప్రతినిధులు, అమరవీరుల బంధు మిత్రులు, పౌర హక్కుల సంఘం నాయకులు నివాళులర్పించారు. సుధాకరన్న అమర్ రహే, రజితక్క అమర్ రహే.. అంటూ నినాదాలు చేశారు. సుధాకర్ ఇంటి నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర వారి పొలం వరకు కొనసాగగా అక్కడ అంత్యక్రియలను పూర్తిచేశారు.

నాలుగు రోజులకు మృతదేహాల రాక..

కాంకేర్, బస్తర్ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు దంపతులు సిరిపెల్లి సుధాకర్, ఆయన భార్య సుమన మృతి చెందారు. రెండు రోజుల వరకు స్థానిక పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రైవేటు వాహనంలో కాంకేర్ జిల్లాకు వెళ్లారు. రోజంతా ఎదురుచూసి శుక్రవారం ఉదయం 6 గంటలకు ఇద్దరి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకువచ్చారు. కడసారి బిడ్డను చూసేందుకు మావోయిస్టు సుమన అలియాస్ రజిత తల్లి అంజనబాయి, సోదరులు చల్లగరిగకు చేరుకున్నారు. దంపతుల మృతదేహాల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.



సుధాకర్, సుమన మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఇది బూటకపు ఎన్‌కౌంటర్

కాంకేర్, బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మృతి చెందలేదని, ఈ ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు మాదన కుమారస్వామి, అమరుల కుటుంబ సభ్యుల రాష్ట్ర అధ్యక్షురాలు భారతక్క ఆరోపించారు. ఆదివాసీల హక్కులు, ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని ఖనిజ సంపదను కాపాడేందుకు పోరాటం చేస్తున్న మావోయిస్టుల ఉద్యమాన్ని అణచివేసేందుకు బీజేపీ కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇప్పటికైనా హత్యాకాండలను ఆపి సైనిక క్యాంపులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. పలు సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు శాంతక్క, అంజమ్మ, సుదర్శన్, శోభ, నవత, రాజగోపాల్, పద్మకుమారి, ఊర్మిళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రత్యేక నిఘా..

మండలంలోని చల్లగరిగెలో మావోయిస్టు దంపతులు సుధాకర్, సుమన అంత్యక్రియల సందర్భంగా పోలీసులు మఫ్టీలో ప్రత్యేక నిఘా పెట్టారు. మృతదేహాలు గ్రామానికి చేరుకున్నప్పటి నుంచి అంత్యక్రియలు ముగిసేవరకు అణువణువూ పరిశీలించారు. స్థానిక పోలీసులతో పాటు నిఘా వర్గాలు గ్రామానికి ఎవరెవరు వస్తున్నారు.. ఏమి చర్చించుకుంటున్నారన్న విషయాలపై ఆరా తీశారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్19: నిబంధనలు ఉల్లఘించిన 20మంది వాహనదా రులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 20 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మందికి 7,000 డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 10 మందికి రూ. 7,000 జరిమానాను విధించారన్నారు.

స్వార్థంతోనే ఆర్జేడీ కార్యాలయం తరలింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం(ఆర్జేడీ) హైదరా బాద్‌కు వెళ్లి సంవత్సర కాలం పట్టకుండానే తిరిగి వరంగల్‌లో ఏర్పాటు చేయాలని వచ్చిన ఉత్తర్వుల వెనుక చర్చనీయాంశ అంశాలున్నాయి. కడప, రాజమండ్రి, గుంటూరు, వరంగల్ ప్రాం తాల్లో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1991లో అప్పటి ప్రభుత్వం జీవో నెం.139 ఉత్తర్వులను జారీ చేసింది. అందుకు అనుగుణంగా వరంగల్‌లో 1999లో ఆర్జేడీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. అప్పటి నుంచి వరంగల్ కేంద్రంగా అప్పటి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఇంటర్మీడియెట్ ఉద్యోగులకు వివిధ సేవలు అందిస్తూ వచ్చింది. గత ఏడాది ఆర్జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి తన సౌలభ్యం కోసం వరంగల్ ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు తరలించే ందుకు అప్పటి కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఉత్తర్వులు జారీ చేయించినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. కమిషనర్ తన విచక్షణా ధికారాలతో కార్యాలయాన్ని తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి నేటి వరకు ఆర్జేడీ, ఏవోలు వేతనాలు మాత్రం వరంగల్ నుంచే తీసుకుంటుండటం గమనార్హం. ఆర్జేడీ కార్యాలయాన్ని వరంగల్ నుంచి ఎత్తివేయాలంటే జీవో నెం. 139ని ప్రభుత్వం రద్దు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేయక పోవడం, సదరు ముఖ్యఅధికారి స్వలాభం కోసం కార్యాలయాన్ని తరలించడాన్ని సవాల్ చేస్తూ అధ్యాపక సంఘాల నాయకులు ఇద్దరు మంత్రు లను ఆశ్రయించి వారికి అసలు విషయం చెప్పా రు. దీంతో ప్రభుత్వం ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని తిరిగి వరంగల్‌లోనే పునఃప్రారం భించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో అధ్యాపకులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 19 : నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 12 పోస్టులకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కిషన్ శుక్రవారం తెలిపారు. పోస్టుల వివరాలిలా వున్నాయి. డిసెక్షన్ హాల్ అటెండర్ల పోస్టులు-4 ఉన్నాయని, వీటికి దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి లేదా సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, అనాటమీ డిసెషన్ లేదా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో కనీసం సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. ల్యాబ్ అటెండర్ పోస్టులు-4. ఇందుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా డీఎంఎల్‌టీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండడంతో పాటు తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు.

అలాగే థియేటర్ అనస్థీషియా అసిస్టెంట్ -4 పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు అనస్థీషియా అసిస్టెంట్ కోర్సులో బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా ఎంఎల్‌టీ ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను పూరించి నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5గంటల లోపు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

ఆఫీసర్స్ క్లబ్ వర్కర్ ఆత్మహత్య

తన చావుకు క్లబ్ సభ్యులు కారణమంటూ ఆడియో రికార్డు



శ్రీనివాస్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 19: హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్‌లో పనిచేస్తున్న జి.శ్రీని వాస్ (42) మనస్థాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోవడానికి క్లబ్ సభ్యులైన చెరుకు రాజిరెడ్డి, గోలి గోపాల్‌రెడ్డి, పొడిశెట్టి రవి ముగ్గురు కారణమని ఆడియో రికార్డులో మృతుడు ఆరోపించాడు. ఆత్మహత్య చేసుకునేముందు ముగ్గురిపై ఆరోపణలు చేస్తూ సెల్‌లో రికార్డు చేసి తన కుమారుడి సెల్‌కు పంపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.ఆఫీసర్ క్లబ్‌లో సభ్యత్వం పేరిట రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవిలు దాదాపు రూ.1కోటి వరకు సభ్యత్వ రుసుము వసూల్ చేశారు. ఈ మొత్తంలో శ్రీనివాస్‌కు రూ.10లక్షలు ఇస్తామని ఒప్పుకున్నారు. ఒప్పుకున్న డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్ ముగ్గురు సభ్యులపై ఒత్తిడి తెచ్చినా స్పందన లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. ఎంతకూ వారి నుంచి స్పందన లేకపోవడంతో సెల్‌లో రికార్డు చేసి కుమారుడికి పంపించి క్లబ్ పైఅంతస్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ సతీమణి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. కేసు విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

ఓటింగ్ శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు

వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగిన కలెక్టర్, అదనపు కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రజాసామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సెల్ఫీ పాయింట్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓలతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని, పట్టణంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వినూత్న కార్యక్రమాల ద్వారా కళాజాత, 5కే రన్, ముగ్గుల పోటీలు, క్యాంపస్ అంబాసిడర్లను కళాశాలల్లో నియమించి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించడమే కాకుండా కలెక్టరేట్, పబ్లిక్ గార్డెన్, వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి యువతను ఓటు శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి, ఏఓ శ్రీకాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలి

▸▸ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని కుడా కాంప్లెక్స్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వరంగల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతి ఖర్చు వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలని తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్‌ఓ స్థాయిలో ప్రతిరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చులు, వ్యయ అకౌంట్, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి రామిరెడ్డి, సహాయ నోడల్ అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే



కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

5వ పేజీ తరువాయి

కోచ్ ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంది కేంద్రంలోని బీజేపీయేనని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయా ఫ్యాక్టరీలు రాకుండా ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు అభివృద్ధి చెందకుండా పాతరేసింది వారు కాదా అని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ మంజూరయితే ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతారనే ఉద్దేశంతో మంజూరు ఆలస్యం చేసింది బీజేపీయేనని మండిపడ్డారు. ఎంపీలందరూ కలిసి కన్న తల్లి, దేవతలాంటి సోనియమ్మను అడిగితే తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని ఐనా సోనియమ్మ ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదన్నారు. ఆ అమ్మ బిడ్డ రాహుల్‌గాంధీని ప్రధాని చేసి రుణం తీర్చుకోవాలన్నారు.

నాడు బలరాం మంత్రి.. మళ్లీ గెలిస్తే ఇంకా పెద్ద పదవి

మహబూబాబాద్ తొలి ఎస్టీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌ను సోనియమ్మ కేంద్ర మంత్రి చేశారని, ఈసారి కూడా ఆయన్ను గెలిపిస్తే అంతకన్న పెద్దస్థాయి పదవి ఆయనకు దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇరుగు, పొరుగున ఉన్న మహబూబాబాద్, ఖమ్మం ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఇవ్వడంలో గట్టి పోటీ నెలకొందని రేవంత్‌రెడ్డి అన్నారు. బలరాంనాయక్‌కు 3లక్షలకు తగ్గకుండా మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందుకు అందరు సిద్ధమేనా అంటూ పదే.. పదే ప్రశ్నిస్తూ సభికుల నుంచి ఔననే సమాధానం చెప్పించారు. రేవంత్ ప్రసంగం ఆసాంతం కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, యశస్వినిరెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, రాములునాయక్, పొదెం వీరయ్య, బెల్లయ్యనాయక్, మాలోతు నెహ్రూనాయక్, రవీంద్రనాయక్, రియాజ్, భూక్య ఉమా, నూనావత్ రాధ, మోహన్‌లాల్, నూకల నరేష్‌రెడ్డి, చుక్కల ఉదయ్‌చందర్, కంకర అయ్యప్పరెడ్డి, ఘనపురపు అంజయ్య, ఘంట సంజీవరెడ్డి, మేకల వీరన్న, బండారు వెంకన్న, పోరిక సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిప్పకూడు తినడం ఖాయం

▸▸ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనడం అవివేకం ▸▸ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లీపుట్ అంటున్న మాజీ సీఎం కేసీఆర్ చిప్పకూడు తినే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ 'జన జాతర' సభలో ఆయన మాట్లాడుతూ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతున్నారని, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని పోరంబోకు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో ఫోన్‌ట్యాపింగ్ చేయడం దౌర్భాగ్యమని ప్రతిపక్ష నేతలు కుటుంబ సభ్యులతో మాట్లాడిన వాటిని కూడా ట్యాప్ చేయడం దారుణమన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాలుపంచుకున్న వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. రూ.10లక్షల కోట్ల నిధులు తెలంగాణకు ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.లక్షల కోట్ల శిస్తుకట్టలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి నాలుగు సీట్లు కూడా రావనిచ్చ బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మానుకోటలో పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.

రోల్ మోడల్ సీఎంగా రేవంత్‌రెడ్డి..

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో వందరోజుల పాలనలో ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తూ దేశంలో రోల్‌మోడల్ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకడు మూడునెలలు, మరొకడు ఆరునెలలు ఉంటుందని మాట్లాడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశారని, ప్రజలకు సేవచేయాలనే పట్టుదలతో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ ఆశీస్సులు, రాహుల్‌గాంధీ దీవెనలతో పోరిక బలరాం నాయక్ కేంద్రమంత్రిగా పని చేశారని, ఆయన్ను గెలిపించుకుంటే మళ్లీ ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతారని, ఆయనకు భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

రెండు సిద్ధాంతాల మధ్య పోటీ..

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క

రాష్ట్రంలో రెండువర్గాలు, రెండు సిద్ధాంతాల మధ్య పోటీ జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశసంపదను దోచుకున్న, గాంధీజీని చంపిన గాడ్సే సిద్ధాంతాన్ని అవలంబిస్తున్న బీజేపీకి, దేశం కోసం ప్రాణాలర్పించి, గాంధీ సిద్ధాంతాన్ని కొన సాగిస్తున్న కాంగ్రెస్‌కు మధ్య పోటీ జరుగుతోందన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో ఊరికో ఉద్యోగం ఇవ్వని బీజేపీ విద్వేషాలను రెచ్చగొట్టిందని విమర్శించారు. పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని, తద్వారా ప్రజల హక్కులు కోల్పోతారన్నారు. ప్రజల పక్షాన నిలిచే రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్నారు. బలరాంనాయక్ బోళా శంకరుడని, గతంలో కేంద్ర మంత్రిగా ప్రజాభ్యున్నతే ధ్యేయంగా పని చేశారని, మళ్లీ ఎంపీగా ప్రజా ఆశీర్వాదం కోసం వస్తున్నారని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రేణుల్లో జోష్

5వ పేజీ తరువాయి

తీసుకున్నారు. ఉదయం ఎంపీ బలరాం నాయక్ నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. తమతమ నియోజకవర్గాల నుంచి ప్రజలను భారీగా తరలించడంతో సభ సక్సెస్ అయింది.

సీఎం, మంత్రుల ప్రసంగాలతో హోరెత్తిన సభ..

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిగా బాధ్యతలు చేపట్టాక మానుకోట జిల్లా కేంద్రంలో జరుగుతున్న తొలిసభ కావడంతో సీఎంను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయింది. సభ నిర్ణీత సమయం సాయంత్రం 4 గంటలకు ఎండవేడిమితో జనం రాక కాస్త ఆలస్యమైనప్పటికి 5గంటల కల్లా ఎన్టీఆర్ స్టేడియం నిండిపోయింది. మిగిలిన వారు రోడ్లవెంట ఉండిపోయారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ఎక్కుపెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగించిన ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది, ఆయన ప్రసంగించినంత సేపు జనజాతర సభ ప్రాంగణం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు కేరింతలు, చప్పట్లతో మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీలో మానుకోట, ఖమ్మం మొదటి, రెండుస్థానాల్లో నిలవబోతున్నాయని ఏ స్థానంలో నిలుస్తారో అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. దీనికి తోడు సభకు హాజరైన రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క ప్రసంగాలు సైతం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహా న్ని నింపాయి. సీఎం, మంత్రుల ప్రసంగాల మధ్యమధ్యలో జనం చప్పట్లు, కేరింతలు కొడుతూ, వారికి ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు.

ఉర్రూతలు ఊగిస్తూ..

మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర నిర్ణీత సమయం సాయంత్రం 4గంటలుగా ప్రకటించిన నేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పర్యటన అనంతరం నేరుగా హెలికాప్టర్ ద్వారా మహబూబాబాద్ సభాస్థలి సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు 3.45 గంటలకే చేరుకున్నారు. 45 డిగ్రీలు దాటినా మండు టెండలో సభకు జనం ఆలస్యంగా వస్తుండడంతో సభా ప్రాంగణం కిటకిటలాడే వరకు ప్రత్యేక బస్సులోనే వేచి ఉన్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో వేదికపైకి చేరుకున్న ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు పూర్తయ్యే వరకు అంటే 5.52గంటల దాకా సుమారు 2గంటల 7నిమిషాలు వేచి ఉన్నారు. తర్వాత వేదిక ముందు భాగాన ఏర్పాటు చేసిన ర్యాంప్‌పైకి నడుచుకుంటూ వెళ్లి ప్రజలకు అభివాదం చేసి తిరిగి వేదికపైకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి 23 నిమిషాల పాటు ఉర్రూతలూగిస్తూ నిరాటంకంగా ప్రసంగించారు.

అభ్యర్థి ఎవరో తెలుసుకోవచ్చు...



నియోజకవర్గంలో ఎంత మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారో తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) అనే యాప్ ఉంది. దీని ద్వారా పోటీ చేసే అభ్యర్థి పేరుతోపాటు పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

ఓటర్ హెల్ప్‌లైన్...



ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవడంతోపాటు నూతనంగా ఓటరుగా నమోదు, తప్పులను సరిచేసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్, నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా పొందవచ్చు.

దివ్యాంగులు, వృద్ధుల కోసం



దివ్యాంగులు, వృద్ధుల కోసం సాక్షం యాప్ అందుబాటులో ఉంది. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారు ఈ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు పరిశీలించి పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు రవాణా సదుపాయం కల్పిస్తారు. వారికి ప్రత్యేకంగా ఒక సహాయకుడిని సైతం అందుబాటులో ఉంచుతారు.

- వరంగల్ కలెక్టరేట్







వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థి ఏఆర్. నేనా ప్రేమ్ రెడ్డి రిపిక, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ , బీఎస్పీ అభ్యర్థి పంజా కల్పన

ప్రశాంతంగా నామినేషన్ల పర్వం

రెండోరోజు వరంగల్‌లో నాలుగు, మానుకోటలో ఐదు నామినేషన్లు

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి రెండోరోజైన శుక్రవారం మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు అభ్యర్థుల ద్వారా నాలుగు నామినేషన్లు రాగా.. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా ఏఆర్. నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ ఒక సెట్, బీఎస్పీ అభ్యర్థిగా పంజా కల్పన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థుల ద్వారా ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ములుగు నియోజవకర్గం, మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక బలరాంనాయక్ రెండు సెట్లు దాఖలు చేశారు. ఆయన్ను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి బలపరిచారు. అలాగే భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వాంచ దుర్గ స్వతంత్ర అభ్యర్థిగా, ఆధార్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన జాటోతు రఘునాయక్, నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి గ్రామం ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్‌నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.



మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహబూబాబాద్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్

నామినేషన్ కౌంటర్

రెండో రోజు (19-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
07	06

వరంగల్ (ఎస్సీ) :	పంజా కల్పన (బహుజన సమాజ్ పార్టీ), ఏఆర్.నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ, స్వతంత్ర), పేరంబుదూరి కృష్ణసాగర్ (స్వతంత్ర).
మహబూబాబాద్(ఎస్టీ) :	పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్-2 సెట్లు), పాల్వాంచ దుర్గ (స్వతంత్ర), జాటోతు రఘునాయక్ (ఆధార్‌పార్టీ), బోడ అనిల్‌నాయక్ (స్వతంత్ర).



విజయవాడ లోక్‌సభ స్థానానికి తరిగొప్పుల వాసి నామినేషన్



చెవిటి అర్జున్

తరిగొప్పుల, ఏప్రిల్ 19: ఏపీలోని విజయవాడ పార్లమెంట్ స్థానానికి జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన చెవిటి అర్జున్ నామినేషన్ వేశారు. గురువారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి డిల్లీరావుకు తన ప్రతినిధి ద్వారా రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అర్జున్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజవకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకున్నారు. కాగా, నామినేషన్ విషయమై ఆయన మాట్లాడుతూ తను గుంటూరు జిల్లా జగ్గయ్యపేటలో ఉన్న స్నేహితులకు వద్దకు వెళ్లానని, వారి ప్రోద్బలంతో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ తరుపున రెండు సెట్ల నామినేషన్‌లను తన ప్రతినిధి గుజ్జుల లలిత ద్వారా వేశానని అన్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికల అంశాలకు సంబంధించి సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం మొబైల్ నెంబర్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులను ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఏ.దిలీబన్ మొబైల్ నెంబర్ 83099 21306, అలాగే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింగా మొబైల్ నెంబర్ 8309 952057కు ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద రూ1.53లక్షలు స్వాధీనం



కాజీపేట డీజిల్‌కాలనీ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

కాజీపేట, ఏప్రిల్ 19: కాజీపేట డీజిల్ కాలనీ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో ఓ వ్యక్తి వద్ద నగదు లభ్యమైంది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాజీపేట డీజిల్‌కాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి శ్రీనివాస్ బైక్‌లో రూ.1,53 లక్షలు లభ్యమైనట్టు తెలిపారు. నగదుకు సంబంధించి సరైన దస్తావేజులు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఏ పత్రం ఎందుకోసమంటే..

వరంగల్ సిటీ, ఏప్రిల్ 19: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల్లో ప్రక్రియలో ప్రాధాన భూమిక పోషించే ఫాం-ఏ, ఫాం-1, ఫాం-2ఏ, ఫాం-2సీ, ఫాం-26, ఫాం-బీ అంటే ఏమిటీ..? వాటి ప్రాధాన్యతను ఒక సారి పరిశీలిద్దాం.

నోటీసు జారీ

నామినేషన్ దాఖలుకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నోటీస్ (ఫాం-1) జారీ చేస్తారు. అభ్యర్థులు ఎప్పుడు, ఎక్కడ ఏ సమయంలో ఎవరికి దాఖలు చేయాలో స్పష్టంగా ప్రస్తావిస్తారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన వివరాలు తెలుపుతారు. వీటితో పాటు ఆయా స్థానాల్లో పోలింగ్ ఏ రోజు, ఏ సమయాల్లో జరుగుతుందో వివరిస్తారు. ఫాం-1 ఆదారంగా అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

లోక్‌సభ స్థానం నామినేషన్‌కు...

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఫాం-2 ఏ ద్వారా నామినేషన్ దాఖలు చేయాలి. ఫాం-2ఏ ను లోక్‌సభ నామినేషన్ పత్రంగా పేర్కొంటారు. శాసనభసకు ఫాం -2బీ, రాజ్యసభకు, శాసనమండలికి ఫాం-2సీలో నామినేషన్ సమర్పిస్తారు. అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను కేంద్ర ఎన్నికల సంఘమే ఉచితంగా అందిస్తుంది.

అభ్యర్థులకు కీలకమైనవి ఇవే....

ఎన్నికలు రాగానే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేస్తాయి. అభ్యర్థుల జాబితాను ఒకసారి లేదా విడుతల వారిగా విడుదల చేస్తాయి. జాబితాలో పేరున్నంత మాత్రాన సదరు అభ్యర్థి ఆ పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తారనేది అనుమానమే. ఎందుకంటే ఏదైన ఒక రాజకీయ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థికి సదరు పార్టీ ఫాం-ఏ, ఫాం-బీ అందించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షుడి సంతకాలతో కూడిన ఫాం లనుఅభ్యర్థులు ఎన్నికల అధికారులకు సమర్పించాలి. అప్పుడే అభ్యర్థులు ఆయా పార్టీలతరపున పోటీలో నిలిచినట్లు పరిగనిస్తారు.



ఎన్నికల గుర్తును నిర్ణయించేదే బీ- ఫాం..

తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి వీరే అని ఆ పార్టీ ప్రతినిధి ఇచ్చేదే బీ-ఫాం. దీనిని నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారులకు అందజేయాలి. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు సమర్పించవచ్చు.సదరు పత్రంలో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో పాటు ఆపార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీ- ఫాంను జత చేస్తేనే రిటర్నింగ్ అధికారి ఆ పార్టీ గుర్తును కేటాయిస్తారు. అభ్యర్థి సమర్పించిన ఫాం-ఏ, ఫాం-బీ.ఈ రెండింటిని పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరుపున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

ఫా -ఏ అంటే...

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ఫాం-ఏలో తెలియజేస్తాయి. వీటిపై ఆయ రాజకీయ పార్టీలు అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి సంతకంతో పాటు ముద్ర ఉంటుంది. పార్టీ ఏ వ్యక్తిని తమ ప్రతినిధిగా ఎంపిక చేస్తుందో అతడు/ఆమెకు ఇచ్చేదే ఫాం-ఏ. సదరు అభ్యర్థులు ముందుగా ఫాం-ఏను సంబందిత ఎన్నికల ఆధికారులకు సమర్పించాలి. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎవరు ఎక్కడి నుంచి బరిలో నిలుస్తున్నారనే వివరాలు ఉంటాయి.

అఫిడవిట్‌కు అంతే ప్రాధాన్యం..

నామినేషన్ దాఖలుతో పాటు ఫాం-26(అఫిడవిట్) సైతం అభ్యర్థులు విదిగా సమర్పించాలి. ఫాం-26 అంటే.. అబ్యర్థులు తమతో పాటు తమ కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు పొందుపరుచాల్సి ఉంటుంది.

నేడు బీఆర్ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశం

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఏప్రిల్ 19: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. ఉదయం 9 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఇందులో వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్యతో సహా ఇతర ముఖ్యులు పాల్గొంటారని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



తాడిచర్లలోని హనుమాన్ దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

మల్హర్, ఏప్రిల్ 19 : మండల కేంద్రమైన తాడిచర్లలో హనుమాన్ సహిత శివ పంచాయతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఆంజనేయుడు, గణపతి, పార్వతి, శివుడు, సూర్య భగవానుడు, విష్ణు మూర్తిల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడు రోజుల పాటు సాగనుంది. గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షా స్వీకారం, రుత్విక్వర్ణనం, నవగ్రహ, యోగిని, వాస్తు క్షేత్రపాలక, బ్రహ్మాది మండల పూజలు, అగ్ని ప్రతిష్ఠ దేవతా హోమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

వాజేడు, ఏప్రిల్ 19 : మండలంలోని పేరూరులో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నతపాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ హెచ్‌ఎం, గ్రామస్థులు పేరూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇర్పా ప్రసాద్ అనే వ్యక్తి పాఠశాల ప్రహరీ గోడ నుంచి రోడ్డుకు మధ్యగల స్థలాన్ని ఆక్రమించాడని తెలిపారు. గ్రామపెద్దల సమక్షంలో పాఠశాల స్థలం అని తీర్మానించినా సదరు వ్యక్తి నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. ఈవిషయంపై పేరూరు స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం జోగయ్య, గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కపై ఆరోపణలను ఖండిస్తున్నాం

▸▸ కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అశోక్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 19 : రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, కాంగ్రెస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. శుక్రవారం ములుగులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవ చేసే గొప్ప మనసున్న మంత్రి సీతక్క, కాంగ్రెస్ నాయకులపై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీ‌ష్‌బాబు చేసిన ఆరోపణలు సరికావని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్న మోదీకి రాబోయే పార్లమెంట్ ఎన్నికల భయం పట్టుకుందని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల్లో చీలిక తేవడం కోసం కుట్రలు చేస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. ఒక గిరిజన మహిళ అయిన సీతక్కపై చేసిన అనుచిత వ్యాఖ్యలను హరీ‌ష్‌బాబు వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా,బ్లాక్, మండల నేతలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

▸▸ ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ శబరీశ్



ములుగులో రహదారిపై ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ములుగు, ఏప్రిల్ 19 : జిల్లాలోని ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ములుగు జిల్లా పోలీసు, సీఆర్పీఎఫ్ భద్రతా బలగాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని జాతీయ రహదారిపై పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు, ఇతర అసాంఘిక శక్తులు ప్రజలను పోలింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా నిరుత్సాహపరిచే అవకాశం ఉన్నందున, ఎన్నికల సమయంలో తిరుగుబాటు కార్యకలాపాలు పెరగకుండా ఉండేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నిక ప్రక్రియ పట్ల విశ్వాసం, నైతికతను పెంచుతుందని, ప్రతి ఒక్కరూ భయభ్రాంతులకు గురికాకుండా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని గ్రామాల్లో కూడా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు రంజిత్‌కుమార్ శంకర్, సంతోష్, ఎస్సైలు రాజు, కమలాకర్, వెంకటేశ్వర్, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్-2024కు దరఖాస్తు చేసుకోవాలి

కాటారం, ఏప్రిల్ 19 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఎంట్రన్ పరీక్ష పాలిసెట్-2024 కోసం ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్‌ల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌కు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.250, ఇతర విద్యార్థులకు రూ.500 ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న ఏకైక కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉన్నత విద్యాప్రమాణాలు పాటిస్తూ ఐఎస్‌వో సర్టిఫికెట్, ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపు పొందినట్లు వెల్లడించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలు ఎంట్రన్స్ టెస్ట్ ద్వారానే జరుగుతాయన్నారు.

వడదెబ్బతో తాపీమేస్త్రీ మృతి



సాల్మన్ (ఫైల్)

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 19 : ఓ తాపీ మేస్త్రీ వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన ములుగు మండలం మదనపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాపీ మేస్త్రీ చిలపాక సాల్మన్(50) ఎప్పటిలాగే గురువారం మేస్త్రీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి ఎండదెబ్బతో అలసి నిద్రపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో అతన్ని భార్య వినోద లేపేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. నిరుపేద కుటుంబానికి పెద్దదిక్కు అయిన సాల్మన్ మృతితో దిక్కుతోచని స్థితిలోఉంది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు



గాయపడిన సంపత్‌కుమార్

కాకతీయఖని, ఏప్రిల్ 19 : రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన భూపాలపల్లి ఏరియాలోని గడ్డిగానిపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, సింగరేణి అధికారులు తెలిపిన ప్రకారం... కేటీకే-1వ గనిలో పనిచేస్తున్న వి.సంపత్‌కుమార్(ట్రామర్) శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తోటి కార్మికులు అతన్ని వెంటనే అంబులెన్స్‌లో సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. సంపత్‌కుమార్‌ను పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు.

నాలా ఆర్డర్లను రద్దు చేయాలి

గోవిందరావుపేట, ఏప్రిల్ 19: మండలంలోని రాంపూర్ గ్రామంలో గిరిజనేతరుల వ్యవసాయ భూముల నాలా ఆర్డర్‌లను రద్దు చేయాలని కోరుతూ జాతీయ ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ములుగులో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాంపూర్‌లో గల ప్రభుత్వ నిషేధిత జాబితా భూములకు నాలా కన్వర్షన్ ఇస్తున్నారని, దీంతో గోవిందరావుపేటలో రియల్ ఎస్టేట్ దందా జోరుగా నడుస్తుందని అన్నారు. ప్రభుత్వ భూముల్లో గిరిజనేతరులు భూ మాఫియా దందా చేస్తున్నారని, అధికారులు స్పందించి నాలా ఆర్డర్‌లపై విచారణ జరిపించి రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నాగరాజు, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

తాడ్వాయి, ఏప్రిల్ 19: ప్రస్తుత వేసవి కాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ఉన్నందున పిల్లలు సమీప గ్రామాల్లోని చెరువులు, కుంటలు, బావుల్లోకి ఈతకు వెళ్లకుండా చూడాలన్నారు. అంతేకాకుండా విద్యార్థులు ఆన్‌లైన్ గేమింగ్స్‌కు అలవాటు పడితే అనేక అనర్థాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా పెట్టి దురలవాట్లకు బానిస కాకుండా చూసుకోవాలని, సెలవుల్లో విద్యార్థులు ఇళ్ల వద్దనే ఉండే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

▸▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 19 : గిరిజన కార్మికుల ఆకలి బాధలను తీర్చాలని, 12 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట శుక్రవారం ఔట్ సోర్సింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ హాజరై మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు 12 నెలల వేతన బకాయిలు చెల్లించాలని కార్మికులు ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న వేతనాల చెక్కును వెంటనే క్లియర్ చేయాలని కోరారు. డైలీ వేజ్ వర్కర్లకు రావలసిన ఐదు నెలల జీతాలను ఇవ్వాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా డైలీ వేజ్ వర్కర్లుగా పనిచేసిన వారికి తెలియకుండానే 2017లో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ జీఎంఎస్‌కు అప్పగించారన్నారు. జీఎంఎస్ ఏజెన్సీ కార్మికులకు రావలసిన పీఎఫ్ 2017 నుంచి 2021 వరకు జమ చేయకుండా కాజేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న కార్మికులను ఔట్ సోర్సింగ్ నుంచి తగ్గించి డైలీ వేజ్ పద్ధతిలో యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు బడే సులోచన, పద్మ, పోషాలు, స్వరూప, సుశీల, తారాబాయి, శాంత, సరోజన పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 19 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ములుగు మండలంలోని ఇంచర్ల ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థులకు మాక్‌డ్రిల్ ద్వారా వివరించారు. అనంతరం పలు విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ములుగు అగ్నిమాపక శాఖ కేంద్ర అధికారి ఎమ్డీ.అబ్దుల్‌రహీం, సిబ్బంది నగేష్, మధుసూదన్, భార్గవ్, మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీవోపై చర్యలు తీసుకోవాలి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 19 : మండలంలోని మహిళా పంచాయతీ కార్యదర్శుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మండల పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కార్యదర్శుల పట్ల గత నెలలో ఎంపీవో వీరస్వామి అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారు మార్చి 7న డీపీవోతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టి నివేదికను జిల్లా అధికారులకు అందజేశారు. ఇదేక్రమంలో ఈ నెల 15న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో ముగ్గురు జిల్లా స్థాయి మహిళా అధికారుల కమిటీ విచారణ చేపట్టి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సంఘటనపై లిఖితపూర్వకంగా రాయించుకున్నారు. ఇదిలా ఉండగా, మహిళా పంచాయతీ కార్యదర్శులు ఎంపీవోపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోగా అతనికే ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామాలయంలో అద్భుతం

▸▸ శ్రీరాముడి నుదుటిని స్పృశించిన సూర్యకిరణాలు



రాముడి విగ్రహం నుదుటిని తాకుతున్న సూర్యకిరణాలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 19 : ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో అద్భుతం జరిగింది. శ్రీరాముడి విగ్రహం నుదుటిని సూర్యకిరణాలు తాకాయి. శుక్రవారం ఉదయం 6 గంటల 37 నిమిషాలకు శ్రీరాముడి విగ్రహానికి అలంకరణ పూర్తిచేశారు. అనంతరం రాముడిపై సూర్యకిరణాలు నేరుగా నుదుటి మీద పడడం కనిపించింది. రామాలయంలో అర్చకుడిగా పని చేస్తున్న నాగేశ్వరరావు శర్మ ఆ దృశ్యాన్ని చూశారు. కొంతసేపు లైట్ వెలుతురు అనుకుని అన్ని పరిశీలించగా నేరుగా సూర్యకిరణాలు శ్రీరాముడిని ముద్దాడిన విషయం గమనించారు. దాంతో ఏటూరునాగారంలోని రామాలయంలో శ్రీరాముడి లీలలు మరోసారి ప్రజలను పులకింపజేశాయి. అయోధ్యలో శ్రీ బాలరాముడు ప్రతిష్ఠాపన అనంతరం రామాలయాల్లో ఇలా జరగడం ఒక విశేషమని అందరు భావిస్తున్నారు. శాస్త్రోక్తంగా రామాలయంలో శ్రీరాముడికి జరిగిన కల్యాణం అనంతరం ఇలా కనిపించడం మరో విశేషం. ఈ దృశ్యాలను ఆలయ అర్చకులు తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ దృశ్యం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి రామయ్య

▸▸ సన్మాన కార్యక్రమంలో డీఈవో పాణిని



రామయ్యను సన్మానిస్తున్న డీఈవో పాణిని, ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 19 : నిత్య విద్యార్థి, బహుముఖ ప్రజ్ఞాశాలి కందాల రామయ్య అని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. ములుగు మండలంలోని అబ్బాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల మనో విజ్ఞానశాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్యకు శుక్రవారం అభినందన సన్మాన కార్యక్రమం జరగగా డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ, టీటీసీతో 1998లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయ వృత్తిలో అరంగేట్రం చేసిన రామయ్య ఒకపక్క వృత్తిని త్రికరణ శుద్ధితో నిర్వర్తిస్తూ మరోపక్క తాను పనిచేసిన పాఠశాలలో పిల్లల విద్యాభివృద్ధితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అనేక గుణాత్మక సౌకర్యాలు కల్పించారన్నారు. జిల్లా, రాష్ట్ర (ఎస్సీఈఆర్‌టీ,) జాతీయ స్థాయిలో(ఎన్‌సీఈఆర్‌టీ)లో రిసోర్స్‌పర్సన్‌గావిద్యారంగ కార్యక్రమాల్లో కీలక భూమిక పోషిస్తూ, ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయ స్థాయిలో ములుగుకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చారని అన్నారు. అనంతరం రామయ్యను డీఈవోతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గుండా భాస్కర్, డీఎస్‌వో జయదేవ్, ఎస్టీయూ జిల్లా బాధ్యుడు ఏళ్ల మధుసూదన్, డీసీఈబీ సహ కార్యదర్శి యాసం విక్రమ్‌రాజ్, ఉపాధ్యాయులు హనుమాన్, పాపిరెడ్డి, సురేందర్, ప్రభావతి, పరిమళ, శ్రీధరస్వామి, శ్రీదేవి, రమేష్, జ్యోతి పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులకు నాలుగు గేదెలు బలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 19 : వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని ముల్లెకట్ట, రాంపూర్ గ్రామాల శివారు చిన్న చెరువు అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... ముల్లెకట్ట, రాంపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చారు. కాగా, మేత కోసం అడవికి వెళ్లిన పాడి గేదెలకు విద్యుత్ తీగలు తగలడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అటవీ ప్రాంతంలోకి వెళ్లి పరిశీలించారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న కంతనపల్లి ఇన్‌చార్జ్ బీట్ అధికారి రూప్‌సింగ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపారు.

కారు, టాటా మ్యాజిక్‌ను ఢీకొన్న బొలేరో

▸▸ ఒకరికి గాయాలు, వాహనాలు ధ్వంసం

కాటారం, ఏప్రిల్ 19: మండలంలోని బయ్యారం క్రాస్ సమీపంలో 353(సీ) జాతీయ రహదారిపై శుక్రవారం బొలేరో ట్రాలీ వాహనం ఓ కారును, మరో టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన మణికంఠ అనే వ్యక్తి గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన బొలేరో వాహనం భూపాలపల్లి వైపు నుంచి వస్తోంది. మంచిర్యాలకు చెందిన గోవిందరెడ్డి కుటుంబంతో కలిసి భూపాలపల్లికి వెళ్తున్నారు. పంకెనకు చెందిన రమేష్ టాటా మ్యాజిక్‌తో భూపాలపల్లి వెళ్తున్నాడు. బయ్యారం స్టేజీ సమీపంలో బొలేరో వాహనం వేగంగా మొదట కారును ఓపక్క నుంచి ఢీకొంది. కారు పల్టీకొట్టి తిరిగి యథాస్థితికి చేరింది. కారు వెనకాలే వస్తున్న టాటా మ్యాజిక్‌ను సైతం బొలేరో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, టాటా మ్యాజిక్, బొలేరో వాహనాలు ధ్వంసమయ్యాయి. కారు, టాటా మ్యాజిక్‌లో ఉన్న వారు సురక్షితంగానే ఉండగా, బొలేరో డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. ప్రమాద సంఘటనపై కారు డ్రైవర్ మహ్మద్ వసీంఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

వాజేడు, ఏప్రిల్ 19: నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడుతో వెళ్తున్న ఇసుక లారీని పేరూరు పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. పేరూరు ఎస్సై గొర్ల రమేష్ తెలిపిన ప్రకారం... ధర్మవరం వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో వాజేడు వైపు టీఎస్ 07 యూకే 9456 నెంబరు గల లారీ అతివేగంగా వస్తున్న క్రమంలో నిలుపుదల చేసి తనిఖీ చేయగా ఇసుక డీడీలో ఉండవలసిన దానికంటే అదనంగా ఐదు టన్నులు ఎక్కువగా ఉంది. దీంతో లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బోనాల ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

వాజేడు, ఏప్రిల్ 19 : మండలంలోని గుమ్మడిదొడ్డిలో శుక్రవారం చలివేంద్రాన్ని జీపీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నిత్యం తాగునీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జీపీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రేఖశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భారీగా వాహన తనిఖీలు

మహదేవపూర్, ఏప్రిల్ 19 : మహారాష్ట్రలోని గడ్చిరోలి పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటి విడత ఎన్నికలు జరగడంతో శుక్రవారం సరిహద్దుల్లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మండలంలోని కన్నెపల్లి సమీపంలోని తెలంగాణ-మహారాష్ట్ర అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు భారీగా వాహన తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని ఆపి పత్రాలను పరిశీలించారు. ఎందుకు ప్రయాణాలు చేస్తున్నారో తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించి ధృవీకరించుకున్నాకే వారి ప్రయాణానికి అనుమతించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 19 : భూపాలపల్లి పట్టణంలోని వేశాలపల్లి శివారులో గల డబుల్ బెడ్‌రూం ఇండ్లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కారం చేయాలని శుక్రవారం మునిసిపల్ కమిషనర్‌కు డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు వినతి పత్రాన్ని అందించారు. గత కొద్ది రోజులుగా తాము నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమకు నీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైపులైన్ వేసినప్పటికీ నీరు రావడం లేదన్నారు. వీలైనంత త్వరగా బోర్లకు మోటార్లను బిగించి నీటిని సరఫరా చేయాలని కోరారు.

శేష జీవితం దైవచింతనలో గడపాలి

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 19: శేష జీవితం దైవచింతనలో గడపాలని, ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరిగా జరుగుతుందని ములుగు డీసీఈబీ చైర్మన్ విజయమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ సంగ చేరాలు ఉద్యోగ విరమణ కార్యక్రమం హెచ్‌ఎం రాధిక అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయమ్మ మాట్లాడుతూ గత 38 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ జీవితాన్ని సంతోషంగా పూర్తి చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందడం అదృష్టంగా భావించాలన్నారు. ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా కృషి చేసిన చేరాలు సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు చేరాలును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, మాజీ ఎంఈవో ఐలయ్య పీఈటీలు బలరాంరెడ్డి, సారయ్య మల్లయ్య, శరత్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, వేణు, ఉపాధ్యాయులు బాబూరావు, సలేంద్రం పాల్గొన్నారు.

కొడుకా.. నిన్ను ఒక్కసారి చూడాలి..

(5వ పేజీ తరువాయి)

సభ్యుడు బడే చొక్కారావు ఇంటికి శుక్రవారం వెళ్లిన పోలీసులు బతుకమ్మ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని చేయూతను అందించారు. పస్రా సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డితో బతుకమ్మ ఆవేదనతో మాట్లాడారు. వృద్ధాప్యంలో తల్లికి చేదోడు వాదోడుగా ఉండాల్సిన కొడుకు ప్రజల కోసం అడవిబాట పట్టాడని బావోద్వేగానికి గురయ్యారు. తన ఆరోగ్యాన్ని దగ్గరుండి చూడలేక పోతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజల కోసం కొన్నేళ్లుగా కుటుంబానికి దూరం ఉంటున్నాడని తెలిపింది. ఇప్పటికైనా తల్లి కోసం ప్రజా క్షేత్రంలో కలిసి పోరాడాలని సీఐ శంకర్ అన్నారు. ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛందంగా లొంగిపోవాలని కోరారు. అనంతరం బతుకమ్మకు నిత్యావసర సరుకులు అందించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొడుకు వచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గొత్తికోయ గూడేల్లో కార్డన్ సెర్చ్

తాడ్వాయి మండలం మేడారం, కాల్వపల్లి, పలు గ్రామాల శివారులోని గొత్తికోయ గూడాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులను గుర్తించి సమాచారం అందించాలని లేకుంటే ఆశ్రయం కల్పించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 19 : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా నమోదు చేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగ్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లాకు వచ్చిన ధీరజ్‌సింగ్ కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీఎస్టీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎంసీఎంసీ ద్వారా పెయిడ్ ఆర్టికల్స్, కరపత్రాల పోస్టర్లు, ప్రచార సామగ్రి వ్యయాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 19 : మండలంలోని మల్లయ్యపల్లిలో గుడుంబా స్థావరాలపై ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లను తనిఖీ చేస్తుండగా జాటోత్ సరోజన, జ్యోతి గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డారని, దీంతో వారి వద్ద నుంచి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. గుడుంబా విక్రయానికి పాల్పడుతున్న సరోజన, జ్యోతిలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు.

'ఆయిల్ పామ్'లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 19 : ఆయిల్ పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ డివిజనల్ అధికారి రామాచారి అన్నారు. మండలంలోని అంబట్‌పల్లి, పెద్దంపేట గ్రామాల్లో శుక్రవారం ఆయిల్ పామ్ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మూడు సంవత్సరాల వయస్సు గల తోటలలో జనుము, పచ్చిరొట్ట ఎరువులు ఏర్పడే విధంగా మొక్కలు నాటుకోవాలన్నారు. మొక్కల్లో అవసరం మేరకు మాత్రమే ఎండిన, విరిగిన లేదా చీడపీడలు ఉన్న ఆకులను తొలగించుకోవాలని సూచించారు. మొక్క దశను బట్టి చేపట్టవలసిన పద్ధతులను రైతులకు వివరించారు. ఆయన వెంట ఉద్యాన శాఖ మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లాలో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించిన ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు 2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల స్కీంకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తుల రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న కళాశాలల యాజమాన్యాలు ఈ-పాస్ కాలేజ్ లాగిన్‌లో ఈ నెల 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సంబంధిత హార్డ్‌కాపీలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

● భూపాలపల్లిటౌన్ : కార్పొరేట్ కళాశాల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సునిత అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగులు, మైనారిటీ విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఎంసెట్ శిక్షణ అందించుటకు గాను కార్పొరేట్ కళాశాలల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల కళాశాలల యాజమాన్యాలు హెచ్‌టీపీపీ://తెలంగాణ ఈపాస్.ఈజీజీ.జీవోవీ.ఇన్ ద్వారా ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.